నృత్యంతోనూ ఫిట్‌నెస్

- ప్రత్యేక శిక్షణ ఇస్తున్న డ్యాన్స్ సెంటర్ల నిర్వాహకులు
- ఆసక్తి చూపుతున్న నగర యువత
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో వెలుస్తున్న ప్రత్యేక స్టూడియోలు

బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని మాయం చేసే సాల్సా. నాడీ స్పందనను పెంచే జుంబో.. ఉత్సాహాన్ని పెంచే హిప్‌హాప్.. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే సంప్రదాయ నృత్యం.. ఇలా ఏ నాట్యమైనా ఆర్యోగాన్ని ప్రసాదించేదే. మన శరీరంలోని అనవసరపు కొవ్వును కరిగించి రోగాలను దూరం చేసేదే. ఇలాంటి నృత్యానికి ఇటీవల ఫిట్‌నెస్ మంత్రను కలిపి నగరంలోని శిక్షకులు ఆరోగ్య పరిరక్షణకు మరింత ప్రాదాన్యం ఇస్తున్నారు. ఇటీవలి కాలంలో నాట్యం మనిషి జీవితంలో ఓ భాగంగా మారుతోంది. దీంతో డ్యాన్స్ శిక్షకులు నృత్యంతో పాటు శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఇందుకోసం కొత్తరీతులను రూపొందిస్తున్నారు. శారీరక సౌష్టవ శిక్షకులు సైతం ఇప్పుడు అలాంటి నృత్యరీతులను నేర్పేందుకు ముందుకొస్తున్నారు. ఆరోగ్యంతో కూడిన నృత్యం ఎంతో ఉపయోగకరమని శిక్షకులు చెబుతున్నారు. యువత కూడా అలాంటి నాట్యాన్నే నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని ఓ డ్యాన్స్ సెంటర్ శిక్షకుడు సాజిద్ పేర్కొన్నారు. ఈ రకమైన శిక్షణ ఇచ్చేందుకు బంజారాహిల్స్‌లో మూడు, జూబ్లీహిల్స్‌లో రెండు స్టూడియోలు వెలిశాయి. వీటిని కొరియోగ్రాఫర్‌లు నిర్వహిస్తుండటంతో ఆదరణ పెరుగుతోంది.

వార్మప్‌తో నృత్యం ప్రారంభం..

క్రీడాకారులు వార్మప్ చేసి సమాయత్తమవుతారు. దీనివల్ల వారి శరీరం ఉత్తేజితమై ఆడేందుకు సహకరిస్తుంది. ఇప్పుడు ఇదే సంస్కృతి నృత్యాలకూ వర్తిస్తోంది. తొలుత వార్మప్ చేసేందుకు నెమ్మదిగా వచ్చే సంగీతంతో నృత్యం మొదలుపెడతారు. దీనివల్ల శరీరానికి అవసరమైన ప్రాణవాయువును అందించడమే కాకుండా ఉష్ణోగ్రతలను పెంచి సిద్ధం చేస్తుంది ఈ వార్మప్. ముఖ్యంగా బంజారాహిల్స్ స్టూడియో రైడ్, జూబ్లీహిల్స్ డ్యాన్స్ స్టూడియోలు వంటి వాటికి మంచి క్రేజ్ ఏర్పడింది.

బరువు తగ్గే అవకాశం..

శరీరంలోని కాలివేళ్లు, చీలమండ, మోకాళ్లు, పాదాలు, కాళ్లు, పొట్ట, మెడ, భుజాలు, మోచేతులు, మణికట్టును సంగీతానికి అనుగుణంగా తిప్పాలి. నడవడం, కాళ్లు, చేతులను చాచడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. శీతాకాలంలో ఇది కాస్త ఎక్కువగా చేస్తే మంచిది. ప్రతిరోజూ ఉదయం 15 నుంచి 20 నిమిషాల పాటు ఇలా సంగీతానికి అనుగుణంగా వార్మప్ చేయడం వల్ల శరీరం తేలికపడటంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. వ్యాయామంతో కూడిన నృత్యం క్లిష్టమైనది కావడంతో నిపుణులైన శిక్షకుల పర్యవేక్షలో నేర్చుకోవాలి. హిప్-హాప్ నృత్యం 60 నిమిషాలు చేస్తే 370 నుంచి 610 క్యాలరీలను ఖర్చు చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. సాల్సాతో 400 నుంచి 500 వరకు.. స్వింగ్ (తిరగడం)తో 300 నుంచి 550 వరకు.. బాల్‌రూమ్ డ్యాన్స్‌తో 150 నుంచి 300 క్యాలరీను ఖర్చ చేయొచ్చు.


శిక్షణ తీసుకుంటున్న యువత

దాండియాకు మంచి క్రేజ్

దాండియాకు నగరంలో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. యువత ఫిట్‌నెస్‌తో కూడిన దాండియా స్టెప్పులు నేర్చుకునేందుకు వస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. హోలీ సమయంలో చేసే వాన నృత్యాలకూ ఫిట్‌నెస్ మంత్రను కలుపుతున్నాం.

- దినాజ్, ఫిట్‌నెస్ నిపుణులు

డ్యాన్స్‌తో ఫిట్‌నెస్ పెరుగుతుంది

ప్రతిరోజూ ఏ రీతిలోనైనా నృత్యం చేయడం వల్ల శరీరంలో ఉన్న వృదా క్యాలరీలు తగ్గిపోతాయి. శరీరం మొత్తం ఎలా కావాలంటే అలా స్పందిస్తుంది. కేవలం ఫిట్‌నెస్ కోసం కొన్ని నృత్యాల ఆకృతులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. సంప్రదాయ సాల్సా, జుంబా వంటి నృత్యాల్లోనే వ్యాయామం పూర్తి చేసేలా రూపకల్పన చేశాం. సినీ నటులు కూడా వీటిపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారు.

- సాయిరాజ్, కొరియోగ్రాఫర్


ప్రజావాణిలో సమస్యలను వింటున్న డా. చిన్నారెడ్డి, దివ్య

‘ప్రజావాణి’కి 384 వినతులు

బేగంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 384 దరఖాస్తులు వచ్చాయి. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి వినతులను తీసుకున్నారు. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు 255, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 60, విద్యుత్ శాఖకు 24, రెవెన్యూకు 15, ఇతర శాఖలకు సంబంధించి 31 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.


జాతీయస్థాయి తైక్వాండో కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్‌లు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు మోతీనగర్ విద్యార్థులు

ఎర్రగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి తైక్వాండో కరాటే పోటీలకు ఎంపికయ్యారని కోచ్‌లు గౌతం, చైతన్య తెలిపారు. అక్టోబర్ 24న జోగులాంబ గద్వాల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అండర్ 17 కేటగిరీలో హర్షిత్‌కృష్ణ, డి.అభిరామ్, జంపల కారుణ్యదీపిక బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 8 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్‌లోని విదిశాలో జరిగే 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఇన్ తైక్వాండో కరాటే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.


రాములు నాయక్‌కు చెక్కును అందజేస్తున్న గ్లాస్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

గ్లాస్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తా

ఎర్రగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్లాస్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ అన్నారు. గ్లాస్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు మెరుగైన వేతన ఒప్పందం చేసినందుకు గాను ఆయనకు ఉద్యోగులు రూ.8 లక్షల చెక్కును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ.. యూనియన్ ఉద్యోగులు తనకు అందించిన డబ్బును వారి అభ్యున్నతి కోసమే వినియోగిస్తానని చెప్పారు.


పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవాలని వేధిస్తూ ఇంటికి వచ్చి మరీ యువతిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. వెంకటగిరికి చెందిన ఓ యువతి పనినిమిత్తం రోజూ శ్రీనగర్‌కాలనీకి వెళ్తుంటుంది. ఈ క్రమంలో నవాజ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్ల తార్వత నవాజ్ పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. అయితే అతడికి అప్పటికే వివాహమైన తెలియడంతో దూరంపెడుతూ వస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం నవాజ్ యువతి ఇంటికి వెళ్లి పెళ్లిచేసుకోవాలంటూ దాడిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాకింగ్ చేస్తూ విదేశీయుడి మృతి

బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తూ విదేశీయుడు గుండెపోటుతో మృతిచెందాడు. సోమాలియాకు చెందిన రేగే అలీ అహ్మద్ చికిత్స నిమిత్తం నగరానికి వచ్చి బంజారాహిల్స్‌లో ఉంటూ ప్రతిరోజూ కేబీఆర్ పార్కులో వాకింగ్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గత నెల 31న సాయంత్రం వాకింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుండెపోటుతోనే మృతిచెంది ఉంటాడని వైద్యులు తెలిపారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఎర్రగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం రాత్రి భరత్‌నగర్‌లోని శశికళ థియేటర్ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు డీసీఎం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామని.. మృతుడిని గుర్తించిన వారు సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో లేదా 8331013246, 94906 78445 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కృష్ణగౌడ్ కోరారు.


కృష్ణమూర్తి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న నర్సేటి జ్యోతి

మహిళా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం

- ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు కృష్ణమూర్తి

ఖైరతాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా కార్మికుల సంక్షేమానికి తాము కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఐఎన్‌టీయూసీ క్యాంపు కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కార్మిక నాయకురాలు నర్సేటి జ్యోతిని రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు. అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్య, నైపుణ్యంలో మహిళలు పరుషులతో సమానంగా దూసుకుపోతున్న తరుణంలో వారికి రెండవ ప్రాధాన్యత కల్పిస్తుండడం దుర్మార్గమన్నారు. భారత శ్రామిక శక్తిలో మహిళలు 31 శాతంగా ఉన్నారని, అందులో 35 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు పులిపాటి సత్యదేవ్, కార్యదర్శి ఎస్.రాజలింగం, ప్రతినిధులు రాజు, నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.ఆనంద్, బి.లలిత, సుజాత, రకియా సుల్తానా, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిల్లులను గడువులోగా చెల్లించండి

- సైఫాబాద్ విద్యుత్ ఏఈ జి.కిశోర్‌కుమార్

ఇంటర్వ్యూ...



ఖైరతాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరెంటు బిల్లులను గడువులోపు చెల్లిస్తే సర్‌చార్జీల భారం ఉండదని విద్యుత్ శాఖ సైఫాబాద్ ఏఈ జి.కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలను వెల్లడించారు.

సైఫాబాద్ సెక్షన్ పరిధిలో ఎన్ని సర్వీసులు ఉన్నాయి?

సైఫాబాద్ పరిధిలో 12,731 సర్వీసులు ఉండగా.. ఇందులో 500 నుంచి 600 వరకు ప్రభుత్వ సర్వీసులు ఉన్నాయి. కొత్త కనెక్షన్ తీసుకునే వారు టీజీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు?

వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశాం. కొన్ని సందర్భాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపోవడంతో వెంటనే సరిచేశాం. నీరు నిలిచే ప్రాంతాల్లోని స్తంభాలకు షాక్ రాకుండా చర్యలు తీసుకున్నాం.

ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని చాలా మందికి నోటీసులిస్తున్నారట?

సీఎండీ ఆదేశాల మేరకు 20కేవీ కంటే ఎక్కువ వినియోగం ఉన్న ప్రైవేటు సంస్థలకు, మల్టీస్టోర్డ్ భవనాలకు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులిస్తున్నాం. సామాన్య పౌరులకు ఇబ్బందులు రాకూడదనే ఇలా చేస్తున్నాం.

మీ సెక్షన్‌లో ప్రతినెలా ఎంత విద్యుత్ వినియోగమవుతోంది?

మా సెక్షన్‌లో నెలకు 30 లక్షల యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం ఉంటుంది. వేసవి కాలంలో అయితే ప్రతినెలా దాదాపు 5 లక్షల యూనిట్ల వరకు అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తారు.

విద్యుత్ సమస్యలపై యాక్షన్ ప్లాన్ ఎలా ఉంది?

సమస్యలపై సీబీడీ వాళ్లు వెంటనే స్పందిస్తారు. ఇరుకైన వీధులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బంచ్ కేబుళ్లను వేస్తున్నాం. వీటిల్లో కండక్టర్లకు ఇన్సులేషన్ ఉంటుంది కాబట్టి ప్రమాదాలు జరగవు.


సదర్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


దున్నపోతుల ఊరేగింపులకు స్వాగతం పలుకుతున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, రోహిణ్‌రెడ్డి, మధుకర్ యాదవ్

‘సదర్’ ఉత్సవంలో అపశృతి

- నిర్వాహక కుటుంబీకుడికి గాయాలు

ఖైరతాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ సదర్ ఉత్సవాల్లో చిన్న అపశృతి చోటుచేసుకుంది. నిర్వాహక కుటుంబానికి చెందిన ఆంజనేయులు యాదవ్ తనయుడు శ్రీనివాస్ యాదవ్ దున్నకు స్నానం చేయించేందుకు హుస్సేన్‌సాగర్‌కు తీసుకెళ్తూ విన్యాసాలు చేయిస్తుండగా అది గాలిలోకి లేచి శ్రీనివాస్‌యాదవ్ కాలిపై దిగడంతో ఫ్రాక్చర్ అయ్యింది. దీంతో నిర్వాహక కుటుంబంలో కొంత నిస్తేజం నెలకొని సదర్ ఉత్సవం ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి


వేడుకల్లో దున్నపోతుతో మేయర్ విజయలక్ష్మి


టపాసులు కాలుస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు


మనవడితో సందడి చేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



డా.కోట నీలిమ దంపతులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత విశాల్ సుధాం

వైభవంగా దీపావళి వేడుకలు

బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు గురువారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో లక్ష్మీదేవికి పూజలు చేసి సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు బాణసంచా కాల్చి సందడి చేశారు. దీపావళి వేడుకల్లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బేగంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆనందోత్సవాలతో ఉండాలని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం జరిగిన దీపావళి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. బేగంపేటలో సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుధాం ఇంట్లో జరిగిన పూజలకు నీలిమ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాల్ సుధాం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూన గౌరీశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో దీపావళి రోజు కాల్చిన క్రాకర్స్ వ్యర్థాల దృశ్యం

గోల్ఫ్ ఆడిన గవర్నర్ జిష్ణుదేవ్



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (టీపీజీఎల్) ట్రోఫీని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆవిష్కరించారు. శుక్రవారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన ఈ లీగ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొద్దిసేపు సరదాగా గోల్ఫ్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ గోల్ఫ్ ట్రోఫీ తెలంగాణ ప్రాచీన వారసత్వానికి ప్రతీకగా ఉందని నిర్వాహకులకు కితాబు ఇచ్చారు. డంపింగ్ యార్డ్ స్థలాన్ని సుందరీకరించి అద్భుతంగా గోల్ఫ్ లీగ్‌ను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. లీగ్‌లో పాల్గొంటున్న 16 జట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, శనివారం నుంచి నవంబరు 30వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో రిథిమకు రెండు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నగరానికి చెందిన యువ పవర్‌లిఫ్టర్ గంగపుత్ర రిథిమ ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. శంషాబాద్‌లో రెండ్రోజుల పాటు జరిగిన జాతీయ డబ్ల్యూపీసీ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రిథిమ రెండు స్వర్ణాలు కొల్లగొట్టింది. విద్యానగర్‌కు చెందిన రిథిమ, సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల విద్యార్థి. జాతీయ పోటీల్లో రిథిమ డెడ్‌లిఫ్ట్‌లో 140 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 62.5 కిలోల బరువెత్తి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. మొత్తంగా ఆమె రెండు విభాగాల్లోనూ కలిపి 202.5 కిలోల బరువెత్తింది. రిథిమను తెలంగాణ డబ్ల్యూపీసీ పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రేఖ, కోచ్ విక్రమ్ అభినందించారు.

రైల్వే ఆధ్వర్యంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారుల కోసం దక్షిణమధ్య రైల్వే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పెన్షనర్లకు పెన్షన్ కొనసాగించేందుకు ఏటా నవంబరు నెలలో లైఫ్ సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది. పెన్షన్ అండ్ పెన్షనర్ల సంక్షేమశాఖ యూఐడీఏఐ, ఎంఈటీవై సహకారంతో 73 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల “ఈజ్ ఆఫ్ లివింగ్”ని పెంపొందించడానికి ఫేస్ అథెంటికేషన్‌ను ప్రారంభించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో పెన్షన్‌దారులు ఫిజికల్ వెరిఫికేషన్ కోసం పెన్షన్ పంపిణీ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం ఉండదన్నారు.


కృష్ణానగర్ బీ బ్లాక్ మసీదు వీధిలో పరిస్థితి

మురుగు కాలువను తలపిస్తున్న రోడ్డు

యూసుఫ్‌గూడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం కురిసిన వర్షానికి కృష్ణానగర్ బీ బ్లాక్ మసీదు వీధిలో పెద్ద ఎత్తున మురుగు ప్రవహించింది. ఈ వీధిలో తరచూ మురుగు ప్రవహిస్తూనే ఉంటుంది. దీనికి ఇక కాస్త వర్షం తోడైతే పెద్ద మురుగు కాల్వను తలపిస్తుంది. ఎప్పుడూ ఇదే పరిస్థితి ఉంటుందని, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కొడంగల్ సర్పంచులు, మాజీ సర్పంచులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి


మోడల్‌కాలనీ ముఖద్వారం వద్ద పునర్నించిన సూచిక బోర్డును కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు ప్రారంభించారు. కాలనీ వాసులు బుచ్చిబాబు, కోటేశ్వరరావు, సాయి, కృష్ణశాస్త్రి, రమణ, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి


దీపావళిని పురస్కరించుకుని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి శుక్రవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, కూతురు నర్సింహ, కట్ట బలరాం పాల్గొన్నారు. - అమీర్‌పేట, ఆంధ్రజ్యోతి



ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రజావాణి ఇన్‌చార్జీ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య

ఇందిరమ్మ ఇళ్ల కోసం అధిక దరఖాస్తులు

● ప్రజావాణికి 384 దరఖాస్తులు

బేగంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణికి 384 దరఖాస్తులు వచ్చాయి. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇంచార్జీ డా. చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దరఖాస్తులు తీసుకొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వినతులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని దరఖాస్తుదారులకు వారు హామీ ఇచ్చారు. మైనార్టీ వెల్ఫేర్‌శాఖకు 255, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి 60, విద్యుత్ శాఖకు 24, రెవెన్యూకు 15, ఇతర శాఖలకు సంబంధించి 31 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నేడు ప్రభుత్వ పాఠశాల సందర్శన

బౌద్ధనగర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో నిర్మాణంలో ఆగిపోయిన ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీకాలేజీ ప్రాంగణాన్ని శనివారం లష్కర్ జిల్లా సాధన సమితి, పాఠశాల, కాలేజీ పేరెంట్స్ కమిటీతో సందర్శిస్తున్నామని సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్‌యాదవ్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల, కళాశాల ప్రాంగణాన్ని, భవన నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన తెలిపారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పెన్షనర్ల కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పింఛను దారుల కోసం దక్షిణ మధ్య రైల్వే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పెన్షనర్లకు పెన్షన్ కొనసాగించేందుకు యేటా నవంబరు నెలలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది. పెన్షన్‌అండ్ పెన్షనర్ల సంక్షేమశాఖ (డి డిపార్ట్మెంట్ ఆఫ్ పెన్షన్‌అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్) యూఐడీఏఐ, ఎంఈటీవై సహకారంతో 73 లక్షల మంది కేంద్రప్రభుత్వ పెన్షనర్ల "ఈజ్ ఆఫ్ లివింగ్"ని పెంపొందించడానికి ముఖ ప్రమాణీకరణ(ఫేస్ అథెంటికేషన్)ను ప్రారంభించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో పెన్షన్‌దారులు ఫిజికల్ వెరిఫికేషన్ కోసం పెన్షన్ పంపిణీ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం ఉండదని, దీంతో సమయం ఆదా అవుతుందన్నారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ప్రమాణీకరణ ప్రక్రియకు భద్రతా అంశాన్ని జోడించడం వల్ల మోసపూరిత క్లెయిమ్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని వివరించారు.

పాడైన బోర్లకు మరమ్మతులు చేయరా?

మారేడుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మోండా డివిజన్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లి అంబేద్కర్ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన పవర్ బోర్, చేతి పంపులు పాడై ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నామని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కదులుతున్న రైలు ఎక్కబోతూ.. రైలు కింద పడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోతూ ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తు రైలు కింద పడి అక్కడికక్కడే మరణించిన ఘటన మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు వివరాల ప్రకారం.. మేడ్చల్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం 2 వద్ద ఆగి ఉన్న రైలు ఎక్కేందుకు గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి పరుగులు తీస్తుండగా ఈలోగా రైలు కదిలింది. రైలు ఎక్కబోతు కాలు జారి రైలు చక్రాల కింద పడి అక్కడికక్కడే మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో విశాఖ వాసి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్నంకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మరణించాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి వివరాల ప్రకారం విశాఖపట్నంకు చెందిన నక్క నారాయణ (49) బతుకుదెరువు కోసం కొద్ది నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి ఫుట్‌పాత్‌పై కాలం వెళ్లదీస్తున్నాడు. విశాఖపట్నంకు వెళ్లడానికి గత నెల 31న రైల్వే స్టేషన్‌లో పడుకుని ఆనారోగ్యంతో అక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఓ వృద్ధురాలు చనిపోయింది. గోపాలపురం ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఓలిఫెంట బ్రిడ్జి దగ్గర గురువారం గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధురాలు చనిపోయి ఉండగా పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు అరచేతిలో!

● సర్దార్‌పటేల్ రోడ్డులో వాహనాల రద్దీ
● భయం.. భయంగా పాదచారులు

రాంగోపాల్‌పేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగించే రోడ్డు ఇది. పాదచారులకు మాత్రం సరైన సౌకర్యాలే లేవు. సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులో రోజు రోజుకు వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డు దాటాలంటే నరకయాతనే. రోడ్డుకి ఓ వైపు ప్యాట్నీ నగర్, పైగా కాలనీ, విమాన్ నగర్ కాలనీ, అవంతి కాలనీ, అంబేద్కర్ నగర్, శివ నగర్ వంటి పలు బస్తీలు, కాలనీలతో పాటు స్వామి నారాయణ్ టెంపుల్, శ్రీ పర్శవంత్ స్వేతాంబర్ జైన్ టెంపుల్, మునేశ్వర స్వామి టెంపుల్, దండు మారేమ్మ టెంపుల్, నగశక్తి టెంపుల్ తదితర ఆలయాలతో పాటు పద్మా అపార్ట్‌మెంట్స్, సైమన్స్ బిల్డింగ్, పలు హాస్టల్స్ కార్యాలయాలు ఉండగా రోడ్డుకి మరో వైపు వెస్లీ డిగ్రీ, పీజీ కళాశాల, సీఎస్ ఐఐటీ కాలేజ్, ఎయిర్ లైన్స్ టవర్స్, రుద్రం టవర్స్‌తో పాటు వీరాంజనేయ స్వామి టెంపుల్, జోరాస్త్రియన్ క్లబ్ వంటివి ఉన్నాయి. నిత్యం వందలాది మంది విద్యార్థులు, భక్తులు, ఉద్యోగస్తులతో పాటు సామాన్యులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఈ సర్దార్ పటేల్ రోడ్డును దాటుతుంటారు. గతంలో అనేక మంది ప్రమాదాల భారిన పడిన సందర్భాలు అనేకం. ఇక్కడ ఓ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.



రోడ్డు దాటుతున్న ప్రజలు

పేరుకు మాత్రం పెలికాన్ సిగ్నల్

సాధారణంగా పాదచారులు రోడ్డు దాటడానికి పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తుంటారు. కానీ సర్దార్ పటేల్ రోడ్డు ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఈ దారి గుండా వీఐపీలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. అందువల్ల ఈ దారిలో ఎటువంటి స్పీడ్ బ్రేకర్లు ఉండవు. దీనితో వాహనాల నియంత్రణ ఉండదు. సీటీఓ జంక్షన్ వద్ద గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదనుండి వాహనాలు ఈ రోడ్డుపైకి ఎంతో వేగంగా వస్తుంటాయి. మరో వైపు రసూల్ పురా సిగ్నల్ విడుదల కాగానే అటు వైపు నుండి వాహనాలు వేగంగా వస్తుంటాయి. పాదచారులు రోడ్డు దాటడానికి వీలుగా పెలికాన్ సిగ్నల్‌ను గతంలో ఏర్పాటు చేసినా, దానిపై పాదచారులకు ఎలాంటి అవగాహన కల్పించక పోయేసరికి అది నామ మాత్రంగా ఉంది.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ప్రపోజల్ పెట్టాం..



గత సంవత్సరమే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జీ ఆవశ్యకతను వివరిస్తూ ప్రపోజల్ పెట్టాం. కానీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం వంటి సమస్యలతో అది ఆచరణకు నోచుకోలేదు. త్వరలో మరోసారి ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలుస్తాం.

- టి.మహేశ్వరీ, బేగంపేట కార్పొరేటర్

మాజీ మంత్రికి వినతి పత్రం ఇచ్చాం..



ఇక్కడ గతంలో రోడ్డు చిన్నగా ఉండేది. కాలానుగుణంగా బ్రిడ్జీ రావడం, మెట్రో రైల్ రావడంతో రోడ్డును ఎంతో వెడల్పు చేశారు. దానితో ప్రజలు అటు ఇటు రాకపోకలు సాగించాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జీ కావాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు గతంలో వినతి పత్రం ఇచ్చినా, సమస్య ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

- చింతపట్ల బద్రీనాథాచార్యులు



మాట్లాడుతున్న అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవకీ దేవి

జింఖాన మైదానంలో 15 వరకు ఎగ్జిబిషన్ పొడిగింపు

సికింద్రాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖాన మైదానంలో జరుగుతున్న ఎగ్జిబిషన్‌ను ఈనెల 15 తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు దేవకీ దేవి తెలిపారు. శుక్రవారం జింఖాన మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు, హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆబాల గోపాలాన్ని అలరించడానికి ఎమ్యూజ్‌మెంట్ పార్క్, తోరా, జాయింట్ వీల్, కప్ సాసర్ ఉన్నాయని వెల్లడించారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మహాకాళి ఆలయంలో అమావాస్య పూజలు

తిరుమలగిరి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు. యశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన, పుష్పార్చన ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అన్నదానం నిర్వహించారు. తిరుమలగిరి లాల్‌బజార్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి అన్నదానంలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీశంకర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, రుక్మయ్య, పీ.రాజు, దర్శన్ రెడ్డి, చిన్నన్న, రాజా రెడ్డి, ఉమేష్, గోపి, సురేష్, అనురాధ రెడ్డి పాల్గొన్నారు.

స్కందగిరి ఆలయంలో అయోధ్య రామ యంత్రం



అయోధ్య రామ యంత్రానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పద్మారావునగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని శ్రీ రామ మందిరంలో ప్రతిష్ఠించనున్న రామ యంత్రం గురువారం రాత్రి పద్మారావునగర్ స్కందగిరిలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చేరుకొంది. కేవలం కంచి పీఠంలో మాత్రమే ఉన్న 500 ఏళ్ల ప్రాచీన శ్రీ రామ యంత్రం ఆధారంగా శ్రీరాముని ఇతర దేవతల మంత్రాలు చెక్కబడిన శ్రీరామయంత్రం,శ్రీ కంచి పీఠాధిపతి శ్రీ శంకరవిజయేంద్ర సరస్వతి స్వామివారి పర్యవేక్షణలో 180 కిలోల బంగారు తాపడంతో రూపొందించబడి, అయోధ్య రామ మందిరంలో ప్రతిష్ఠించడానికి అక్టోబరు 27న తిరుపతిలో ప్రారంభమైన మహారథయాత్ర ఐదు రాష్ట్రాల ద్వారా 1800 కి.మీ. ప్రయాణించి నవంబరు 16న అయోధ్యకు చేరుతుంది.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుండి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామం, వేదపారాయణం, శ్రీరామదాసు కీర్తనల పారాయణం, మహామంత్ర పఠనం, నామ సంకీర్తన, శ్రీ త్యాగరాజ స్వామి పంచరత్న కృతులు వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీ కంచి కామకోటి హిందూ ప్రచార రథంలో పద్మారావునగర్ పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈస్ట్ జోన్ (చిలకలగుడా)ఏసీపి వై.జైపాల్‌రెడ్డి అనేక మంది భక్తులు అయోధ్య రామ యంత్రాన్ని దర్శించుకొన్నారు.



మోడల్ కాలనీ ముఖద్వారం వద్ద కాలనీ పేరుతో పునర్‌నిర్మించిన సూచిక బోర్డును కరెంట్ దీపాలతో అలంకరించి ప్రారంభించిన కాలనీ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు పాల్గొన్న కాలనీ వాసులు బుచ్చిబాబు, కోటేశ్వరరావు, జె.యస్.టి.శాయి, కృష్ణశాస్త్రి, రమణ, అమూల్య తదితరులు

- సనత్‌నగర్ (ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్‌విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి: కాంపెల్లి శ్రీనివాస్



తహసీల్దార్ కార్యాలయం ముందు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వివిధ విద్యా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సీపీఐ నాయకులు

అడ్డగుట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫీజుల పేరుతో పేద వర్గాల ప్రజల్ని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు తగ్గించాలని కోరుతూ సీపీఐ పార్టీతో పాటు బాలల పరిరక్షణ సమితి, తల్లుల సంఘం ప్రతినిధులు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డగుట్టలో ఉన్న మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సికింద్రాబాద్ దూద్‌బావి కమ్యూనిటీహాలులో ఈనెల 3న జరిగే 'పేదరికం నిర్మూలనలో నాణ్యమైన ప్రభుత్వ విద్య పాత్ర' అనే సదస్సుకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు అనుకూలంగా ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. బాలల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు నాణ్యతమైన విద్యను అందించడం దారానే సమాజంలోని పేదరికం అసమానతలు నిర్మూలించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబు, మల్లేష్, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ జమున, ప్రవీణ్, శోభ, శాంత, రామలీల, వీరయ్య, వరలక్ష్మి, సందీప్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య, అరుంధతి పాల్గొన్నారు.

అమావాస్యరోజు అన్నదానంతో పుణ్యం

● బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి

బోయిన్‌పల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నిత్యం కేసులతో అలసిపోయే మాలాంటి పోలీసులకు ఇలా అమావాస్యరోజు పేదలకు అన్నదానం చేయడం సంతృప్తినిస్తోందని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని అమావాస్య అమ్మవారిగుడిగా ప్రసిద్ధ చెందిన బోయిన్‌పల్లి బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన వేడుకలకు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రకాష్ బాంటియా ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, అజిత్ కళ్యాణ్, దుర్గయ్య, రామారావు, నర్సింహ, శ్రీకాంత్, ఆలయ అర్చకుడు సాయికుమార్, స్థానికులు పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు చేస్తున్న బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, జంపన ప్రతాప్

మార్కెట్ యార్డులో గుట్టలుగా గుమ్మడికాయలు!

● నిండామునిగిన గుమ్మడి రైతు

బోయిన్‌పల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ యేడాది దీపావళి గుమ్మడికాయల రైతు నిండా మునిగిపోయాడు. కానీ వ్యాపారులు మాత్రం లాభం పొందారు. తొలుత అనావృష్టి తరువాత అతివృష్టి గుమ్మడి కాయల రైతును నిండా ముంచాయి. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ల పెద్దలు నిర్ణయించిన రేట్లకే అమ్ముకోవాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్టూరు, నూజివీడు, విజయవాడ, అద్దంకి, గుంటూరు, మదనపల్లి, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో రైతులు ఈ యేడాది బాగా పండించారు. కానీ దీపావళి పండుగకు మాత్రం గుమ్మడికాయల రైతులలో ఆనందం కరువైంది. రైతులు చేసేదిలేక పెద్ద వ్యాపారులకు భయపడి 10 నుండి 30 కాయలు ఉండే బస్తాకు రూ.300 చొప్పున కొనుగోలుచేసి మార్కెట్‌లోని వ్యాపారులు మాత్రం బస్తాకు రూ.800 నుంచి రూ.1200 వరకు విక్రయించారు. శుక్రవారం అమావాస్యతో మార్కెట్ బంద్. కొనేవారు ఉండరు. అందులోనూ చాలావరకు గుమ్మడికాయలు మురిగిపోతున్నాయని, వెనక్కు తీసుకువెళ్ళలేని రైతులు వాటిని బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో అలాగే వదిలిపెట్టి వెళ్లిపోయారు. దీంతో శుక్రవారం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా గుమ్మడికాయలు గుట్టలు గుట్టలుగా దర్శనం ఇచ్చాయి. దీంతో మార్కెట్‌యార్డు సెక్రటరీ వెంకన్న ఆదేశలతో వాటిని బయో పవర్ గ్యాస్ ప్లాంట్‌కు తరలించి కరెంటు ఉత్పత్తికి వినియోగిస్తున్నారు.



బోయిన్‌పల్లి మార్కెట్‌లో పడివున్న గుమ్మడికాయలు

దేశంలో అతిపెద్ద మార్కెట్‌యార్డు అయిన బోయిన్‌పల్లి యార్డు శుక్రవారం ఒక్కసారిగా నిర్మానుష్యంగా మారింది. నిత్యం రైతుల రాకపోకలు, క్రయ విక్రయాలు వ్యాపారులు, కొనుగోలుదారులు, వాహనాలతో కిటకిటలాడేది. మార్కెట్ యార్డులో దీపావళి పూజల అనంతరం శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని మార్కెట్ యార్డులో ఎలాంటి క్రయ విక్రయాలు లేవు.



నిర్మానుష్యంగా బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు

భార్య కళ్లెదుటే భర్త దుర్మరణం

● ఇసుక లారీ ఢీకొనడంతో ప్రమాదం

తిరుమలగిరి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన ఇసుక లారీ.. యాక్టివాపై వెళ్తున్న భార్యాభర్తలను ఢీకొట్టిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రామక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ బాపూజీ నగర్‌కు చెందిన దయానంద్ (58), లావణ్య (46) భార్యాభర్తలు. వీరు కూరగాయల వ్యాపారులు. బొల్లారం రైతుబజార్ నుంచి కూరగాయలు తీసుకుని వెళ్లి జవహర్ నగర్ బాపూజీ నగర్‌లో విక్రయిస్తుంటారు. ఇదే క్రమంలో గురువారం తెల్లవారు జామున బొల్లారం రైతుబజార్ నుంచి కూరగాయలు తీసుకుని ఓజోన్ ఆసుపత్రి వద్ద యూటర్న్ తీసుకొని యాక్టివా మీద వెళుతున్నారు. అంతలో హకీంపేట్ నుంచి వస్తున్న ఇసుక లారీ వేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. దీంతో కింద పడిపోయిన దయానంద్ లావణ్యలు లారీ చక్రాల కిందపడి దయానంద్ నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన లావణ్యను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దయానంద్ ను పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఇసుక లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. లారీని బొల్లారం పోలీసులు సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లష్కర్‌లో దీపావళి వేడుకలు



సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు డ్రైఫ్రూట్స్ అందజేస్తున్న శేషుకుమారి



డాక్టర్ కోట నీలిమ దంపతులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత విశాల్ సుధాం



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు స్వీట్లు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ కందిశైలజ

బేగంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ డా. కోట నీలిమ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. బేగంపేటలో సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుధాం ఇంట్లో జరిగిన దీపావళి పూజల్లో డా. కోట నీలిమ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలిమ దంపతులను విశాల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతలు కూన గౌరి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను లష్కర్ వాసులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావుగౌడ్, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణలతోపాటు అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు దీపావళి సంబురాలు జరుపుకున్నారు. ఆలిండియా కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జి పవన్ ఖేరా, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇంచార్జి కోట నీలిమ, నాయకులు కట్టెల శ్రీనివాస్‌యాదవ్, గంట సుధీర్, టి.మనోజ్ తదితరులు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌ను శాసనసభ్యుడు శ్రీగణేష్ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో..

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో వేడుకలు ఘనంగా జరిగాయి. బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కందిశైలజ, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు మందజగన్, సి.మల్లేష్ తదితరులు సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావుగౌడ్‌ను కలిసి స్వీట్లు అందజేసి, శాలువాతో సత్కారించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



కంటోన్మెంట్ సీఈఓను కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

అమీర్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి డ్రైఫ్రూట్స్ అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, కూతురు నర్సింహ, కట్ట బలరాం తదితరులు పాల్గొన్నారు.